# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్ 'ఆర్డర్ ఆఫ్ ఒమాన్' అవార్డును ప్రదానం చేశారు.

❖ దేశంలో గ్రామీణ ఉపాధి, జీవనోపాధి కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)' వి.బి. జి.రామ్ జి. బిల్లు - 2025ను లోక్‌సభ ఆమోదించింది.

❖ సాయుధ దళాల ఆధునీకరణలో భాగంగా స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈల భాగస్వామ్యాన్ని పెంచుతున్నామని కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు.

❖ ప్రాంతీయ వైమానిక కనెక్టివిటీ కోసం ప్రారంభించిన 'ఉడాన్' పథకాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.

❖ ఉత్తర భారతదేశంలో రానున్న రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది.

==================

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్ మస్కట్‌లోని రాయల్ ప్యాలెస్‌లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో 'ఆర్డర్ ఆఫ్ ఒమాన్' అవార్డును ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఒమన్ సుల్తాన్ ఈ అవార్డును ప్రధానికి అందచేశారు. ఈ పురస్కారాన్ని 140 కోట్ల మంది భారత ప్రజలకు అంకితం చేస్తూ.. ఇది రెండు దేశాల మధ్య ఉన్న అచంచలమైన స్నేహానికి నిదర్శనమని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత్–ఒమన్ మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA)పై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా భారత కార్మికులకు న్యాయమైన, స్థిరమైన విధానం, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ ఒప్పందంపై భారత వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఒమాన్ మంత్రి ఖైస్ అల్ యూసెఫ్ సంతకాలు చేశారు. ఇది, ఒమన్ 20 ఏళ్ల తర్వాత

కుదుర్చుకున్న రెండో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (FTA) కావడం విశేషం. దీని ద్వారా ఇరు దేశాలకు నూతన ఉద్యోగాలు, వ్యాపారాలకు విస్తృత మార్కెట్ అవకాశాలు, ఆర్థిక అవకాశాలు లభించనున్నాయి. అంతకుముందు.. రాయల్ ప్యాలెస్‌కు చేరుకున్న నరేంద్ర మోదీకి ఒమన్ సుల్తాన్ ఘనంగా స్వాగతం పలికారు. మస్కట్‌లో ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయుల సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. భారతీయ సంస్కృతికి వైవిధ్యం పునాది అని, భారతీయ విలువలు ఎక్కడైనా కలిసిపోవడానికి సహాయపడతాయని అన్నారు. ప్రవాస భారతీయుల సంక్షేమానికి భారత్ కట్టుబడి ఉందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

దేశంలో గ్రామీణ ఉపాధి, జీవనోపాధి కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)' వి.బి. జి రామ్ జి బిల్లు- 2025ను లోక్‌సభ ఆమోదించింది. ఈ చట్టం ద్వారా, 2005లో అమలులోకి వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA) స్థానంలో కొత్త విధానం అమలులోకి రానుంది. ఈ బిల్లులో భాగంగా, ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల వేతన ఉపాధి హామీ లభిస్తుంది. ఈ పథకం అమలుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 : 40 శాతం నిష్పత్తిలో భరిస్తాయి. అయితే ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ రాష్ట్రాలకు మాత్రం కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం నిధులు సమకూరుస్తాయి. బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గ్రామీణ అభివృద్ధి తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఈ బిల్లుపై రాజ్యసభలో చర్చ ప్రారంభమైంది. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ బిల్లును కొద్ది సేపటి క్రితం సభలో ప్రవేశపెట్టారు.

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

“ఆపరేషన్ సిందూర్”లో భారత వైమానిక దళం చూపిన ధైర్యం, వేగం, కచ్చితత్వాన్ని రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రశంసించారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన `ఎయిర్ ఫోర్స్ కమాండర్ల సదస్సు`లో ఆయన మాట్లాడుతూ.. తక్కువ సమయంలో అధిక ప్రభావం చూపగల సామర్థ్యాన్ని `ఆపరేషన్ సిందూర్` ద్వారా భారత్ నిరూపించిందని స్పష్టం చేశారు. 21వ శతాబ్దపు పోరాటం కేవలం ఆయుధాల మధ్య కాదని, ఇది ఆలోచనలు, సాంకేతికత, పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యాల మధ్య జరిగే యుద్ధమని రాజ్ నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. సాయుధ దళాల ఆధునీకరణలో భాగంగా స్టార్టప్‌లు, సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమల (MSME) భాగస్వామ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. ఐడెక్స్ (iDEX), అదితి (ADITI) వంటి పథకాల ద్వారా రక్షణ రంగ తయారీలోకి యువ మేధావులను ఆహ్వానిస్తున్నామని కేంద్రమంత్రి వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

దేశ ప్రఖ్యాత శిల్పి రామ్ వంజీ సుతార్ నిన్న రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో తన నివాసంలో కన్నుమూశారు. శత వసంతాల వయసులో వయో సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన చివరి శ్వాస విడిచారు. ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహంగా గుర్తింపు పొందిన గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం) రూపశిల్పి ఆయనే. కళారంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం 1999లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ అవార్డులతో గౌరవించింది. రామ్ వంజీ సుతార్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి దేశ కళా రంగానికి తీరని లోటని సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొన్నారు. సుతార్ మృతి పట్ల సంతాపం ప్రకటించిన ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్.. ఆయన చేసిన విశిష్ట కృషిని గుర్తు

చేసుకున్నారు. భారత చరిత్ర, సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలిచే సుతార్ సృజనలు తరతరాల కళాకారులకు స్ఫూర్తినిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = =

'ఉడాన్' పథకాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన అనుబంధ ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. 2014లో దేశ వ్యాప్తంగా ఉన్న విమానాశ్రయాల సంఖ్య 74 కాగా, ప్రస్తుతం అది 160కి పెరిగిందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రాంతీయ వైమానిక కనెక్టివిటీ కోసం 2016లో ప్రారంభించిన 'ఉడాన్' పథకం ద్వారా ఈ విస్తరణ సాధ్యమైందన్నారు. నిరుపయోగంగా ఉన్న పాత రన్‌వేలను సైతం ఆధునీకరించి, ఉడాన్ కింద క్రియాశీలక విమానయాన కేంద్రాలుగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. కేవలం విమానాలకే పరిమితం కాకుండా.. ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తరాఖండ్ వంటి ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు హెలికాప్టర్ సేవలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రాంతీయ అనుసంధానతను పెంచడం ద్వారా ఆర్థికవృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ రంగం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భరత) దిశగా సాగుతోందని, 2029 సంవత్సరం నాటికి దేశీయ రక్షణ ఉత్పత్తుల విలువను 3 లక్షల కోట్ల రూపాయలకు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, క్రీడలు - యువజన వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రక్షణ రంగ ప్రగతిని వివరించారు. రక్షణ ఎగుమతులు కూడా వచ్చే నాలుగేళ్లలో 25 వేల కోట్ల రూపాయల నుండి 50 వేల కోట్ల రూపాయలకు పెరుగుతాయని చెప్పారు. ఇది అంతర్జాతీయ రక్షణ రంగంలో భారత్ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుందన్నారు. ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు లైసెన్సింగ్ నిబంధనల సరళీకరణ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం, ఎంఎస్ఎంఈ (MSME)ల క్రియాశీలక పాత్ర, సాంకేతిక బదిలీ వంటి అంశాలు తోడ్పడుతున్నాయని మాండవీయ వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో ఈనెల 21 వరకు దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. పొగమంచు కారణంగా దృశ్యమానత తగ్గుతుందని తెలిపింది. ఉత్తర భారతదేశంలో రానున్న రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. హిమాలయ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలతో పాటు మంచు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఏటా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. రహదారి భద్రతపై ఎంపీలందరూ తమ నియోజకవర్గాల్లో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = =